స్కెచ్

# "కండక్టర్ పర్మిషన్"

"శశికాంత్"

అప్పటికి అది యెన్నో బస్సు వెళ్ళడమో గుర్తు పెట్టుకోవటం నాకు కష్టమయింది కాని, నేను వచ్చి సరీగ్గా ఆరుగంట లవుతుందని నా గడియారం బాగా గుర్తుపుంచుకొని చూపింది.

ప్రొద్దున్నే ఆరుగంటలకు బస్సుస్టాండుకు యేతెంచిన నాకు పన్నెండు గంటలకు మ్రోగే 'సైరన్' ఆత్మారాముణ్ణి గుర్తుచేసింది. కాని వెళ్ళేమో మూడుగంటల ముప్పదిమూడు నిముషములకు. బస్సు యెంత తొందరగా పరుగెత్తినా గంటన్నర ప్రయాణం అక్కడనుండి నేను వెళ్ళాల్సిన వూరికి.

ఏమైనా కానీయ్! కాస్త ఆత్మారాముణ్ణిని సంతృప్తిపరచి వచ్చి సరాసరి బస్సులో కాలు – యడమే. కండక్టరు గదిమినా, క్రిందకు లాగినా, మరేం చేసినాసరే బస్సులోనుంచి దిగేది లేదు-కృతనిశ్చయుణ్ణయ్యాను.

గుంటూరులో మూడేళ్ళనుండి చదువుతూ, పెళ్ళికి కాలమునకు అందక "బస్సు అందలేదు" అని వున్న నిజం చెబితే నలుగురిలో నామోషీ మాట అటుంచి రాబోయే కాలంలో కాబోయే శ్రీమతి నవ్వబోయే పకపకనవ్వులపాలవుతాను. కాని, వచ్చిన చిక్కేమిటంటే నాకు వొక్క కండక్టరు కూడా తెలియకపోవడమే. ప్రతి కండక్టర్ "ఏమిటండీ! ఇప్పుడు వచ్చి పరుగెత్తాలంటే యెలా వీలవుతుంది? ప్రొద్దుటనుంచి పడివున్నవాళ్ళు ఇంత మంది వుంటే" అంటాడు. నే నెప్పటినుండి ఇక్కడ పడి యేడుస్తున్నానో వాళ్ళెవ్వరికీ తెలియదు. తెలియ చెప్పాలనుకున్నా వాళ్ళకు వినే తీరికలేదు.

తిన్నగా భోంచేసుకొని వస్తూండగనే బస్సు రావటం గమనించాను. దురుసుగా వెళ్ళి, ఎవ్వరూ అడ్డురాని ఫ్రంట్ సీట్ లో ఎక్కి కూర్చున్నాను. అబ్బ! నా ధైర్యానికి నేనే అభినందనాలు చెప్పుకొన్నాను, మరెవ్వరూ పొగిడేందుకు అక్కడ లేనందున.

చెమట తుడుచుకొనేసరికి ఎదురుగా "కండక్టరు పర్మిషను లేనిదే యిక్కడ కూర్చొనరాదు" అని యెర్రని, గుండ్రని అక్షరాలు అచ్చ తెలుగులో (కండక్టర్ పర్మిషన్ అంటే 'అ, ఆ'లే వచ్చిన అన్నయ్యలకు అదేదో అర్థంకాని పచ్చి యింగ్లీషులా వుంటుందనేమో) వ్రాసివుండటం చూడగానే నా నరనరాల్లో రక్తం గడ్డకట్టింది.

అదేమిటో, వెధవ రూట్, బస్సు ఎక్కాకనే టిక్కెట్లు యిచ్చేది. ముందు యిచ్చి యేడిస్తే యెట్లా వుండేదో! పైగా అంతా కండక్టర్ పర్మిషనే, యెక్కడ యెక్కాలన్నా. అవును, ఆయన ఆ బస్సుకు మహారాజు. వారి పర్మిషన్ లేకుండా చిన్ని పిట్ట కూడా దూరటానికి వీల్లేదు. ఆఖరికి ఆయనగారు "రైట్" అనందీ అంత లావు బస్సు, యెంతమంది వున్నా—అర అంగుళం మేరకు కదల్లేదు. అది రూల్-కండక్టరు భాషలో 'రూల్సు!'

ఏమైనా కానీయ్, రక్తం కళ్ళజూచినా సరే బస్సు దిగేదిలేదని నిశ్చయించుకున్నాను. కాని కండక్టరుకేసి చూడగానే కొంచెము బెరుకుమంది ప్రాణం; పోతులాగా వున్నాడు.

ఈ అపాయం దాటే వుపాయంకోసం క్షణం యోచించగానే తెలిసిపోయింది, ముందరవున్న అక్షరాలను మరల ఒకసారి చదువుకొని మురిసిపోయాను.

ఒకరోజు నేనూ, మావాడూ ఒక సినిమా 'ఎడ్వర్టైజ్మెంటు' చూశాము. 'ఇటువంటి చిత్రము మరొకసారి చూడలేరు!' ఇంకా అద్భుతం, అనన్య సామాన్యం కలిపి వ్రాశారనుకోండి. తీరా వెళ్ళి చూస్తే హాల్లోవున్న జనాభాను వేళ్ళమీద లెక్క పెట్టగలిగాం. అదృష్టం పండి, మా డబ్బు మాకు తిరిగి యిచ్చి యిండ్లకు పంపనందున, ఆ 'ఎడ్వర్టైజ్మెంటు'లోని భావం బాగా బోధపడింది—యిటువంటి సినిమా మరల చూడలేము 'బాబో!' అని. అలాంటి వ్రాతే యిదికూడా.

సీటులో ధైర్యంగా కూర్చున్నాను, కండక్టరుతో మాట్లాడాల్సిన విధానంగురించి మనస్సులో వల్లించుకొంటూ. ఆయనగారు రానే వచ్చాడు పిడుగులాగ.

"ఏమండీ! మీరు యెవరి పర్మీషను అడిగి యెక్కారు?" అప్పుడు ఆయన సినిమాలో యెవరి పోజ్‌ను 'యిమిటేట్' చేశాడో పోల్చుకోలేక పోయాను.

'ఎవర్నీ అడగకుండానే' తొణకకుండా చెప్పాను.

"అక్కడ యేమి వ్రాసివుందో చూశారా?"

"ఆహా! నేను బి. ఏ. చదువుతున్నాను."

"అయితే దిగిరండి." అధికార దర్పం వ్యక్తపడుతూంది ఆ పలుకులో.

"ఎందుకు?"

"ఎందుకేమిటండీ! కండక్టరు పర్మిషన్ లేనిదే యెక్కకూడదని రాసేవుంటే!"

"నిమ్మళంగా మాట్లాడు. బాగా చూడు యిక్కడ. కండక్టరు...పర్మిషన్ లేనిదే యిక్కడ కూర్చొనరాదు. కాని మాకెందుకు ఒకరి పర్మిషన్?" బస్సులో జనమంతా మాకేసి చూశారు

కండక్టర్ తెల్లమొఖం వేశాడు. అయినా తడబడకుండా, "ఇట్లా పెడర్థాలు యేమీ కుదరవు, దిగండి."

"ఆగండి! అసలు అర్థం మీకు బోధపడవచ్చు. కానీ చదువుకొన్న ప్రతివాడికి యీ అర్థం సులభంగా బోధపడుతుంది. నన్నట్టే కదిలించకండి. కావాలంటే ఇకపైని మీ అర్థం వ్రాసి యిక్కడ వేలాడదీయండి."

"అతి తెలివి చూపించక దిగిరండిముందు." ఇంకా నన్ను "ఆల్టాటప్పు" క్రిందనే జమకడుతున్నాడు.

"ఏంహ్! అనవసరంగా నోరుపారేసుకోకు. అవసరమయితే యే అధికారినిగాని, పెద్దమనిషినిగాని తీసుకొచ్చి వొప్పించు. అసలు నువ్వేం చదువుకొన్నావ్? ఇక్కడ యేం వ్రాసుంది అర్థంకావడానికి!" ...ఓహ్! ఏమి యాక్షన్ చేశాను!

ఎంత విషమ పరిస్థితి! పాపం, ఆ రోజు పొద్దున్నే యెవరి ముఖం చూశాడో! ఇంతకాలం నుండి అనర్గళంగా సాగుతున్న కండక్టర్ పర్మిషన్ కాస్తా యీ క్షణంనుండి కండక్టర్‌కే పర్మిషన్ వుండాల్సిన గతిపట్టింది. ఆహా దైవలీల!

విసురుగా వెళ్ళి, "రైట్" అని దురుసుగా విశిరాడు, లోగడ తనకెంత అధికారం వుండేదో చూపిస్తూ. బస్సు సర్కస్‌లో పెద్దపులిలా 'ఘుర్' అని అరుస్తూ 'హుజూర్ హుకుం'కు బయలుదేరింది.

టిక్కెట్ డబ్బులు అడగటానికి 'నామోషీ' పడ్డాడేమో, ఎవరిచేతనో అడిగించి పుచ్చుకొని, టిక్కెట్ వ్రాసిపంపాడు. హతవిధీ!

బస్సు నేను దిగాల్సిన వూళ్ళో దాదాపు మూడింటికి మూల్గుతూ ఆగింది. మెదటి తారుగా నిక్కించి అంతకంటె యెక్కువ పొడుగు లేనందుకు చింతించాను. శీవిగా దిగారు శ్రీయుతులుగారు.

కండక్టరు అదోలా నవ్వుతూవచ్చి ఆ నవ్వులో భావం యే డిక్షనరీలో దొరకదు—"మీరు యెవరింటికి వెళుతున్నారు?" అని పలకరించాడు.

ఏమిటీ మర్యాద? "రమణారావుగారింటికి" రమణారావుగారికి యెక్కడలేని విలువ యిస్తూ నొక్కి వక్కాణించాను.

"అయ్యో! ఆమాట అప్పుడే చెప్పక పోయ్యారా? అనవసరంగా యెంత తగాదా జరిగింది? లేచినవేళా విశేషం." అన్నాడు జా[illegible] పరుస్తూ.

నిజమని నేను నమ్మలేకదూ! "దానిదేముంది! అలా జరుగుతుంటాయ్ అప్పుడప్పుడు."

"వారు యెప్పుడు వెళ్ళినా మా బస్సులోనే వెళ్తారు."

"అహా!" అనేసి రెండడుగులు వేశాను; అతను అతను చెప్పాల్సింది పూర్తి అయినట్లు భావించి.

వెనకనుంచి "ఆ..ఏమండీ!...కాఫీనీళ్ళకు...యేదో తమరియిష్టం" నసిగాడు.

ఎంత హీనస్థితికి దిగజారి పోయ్యాడు!

"ఛస్! యివ్వకూడదు" అనుకొన్నాను. కాని యెందుకో ఆగి, పోనీ, యీసారి మనకెప్పుడైనా కాస్త 'యిన్‌ఫ్లూయన్స్' వుంటుంది" అని పర్సు తీసి పావలా చేతిలో పెట్టాను. అతను యెంతో రహస్యంగా అందుకొని జేబులో వేసుకొన్నాడు.

అయితే నేనిచ్చింది, యెన్నాళ్ళనుండో నా దగ్గిర వుండిపోయిన చెల్లని పావలా. అది నేనిచ్చిందని వచ్చినా గుర్తుపట్టలేదు. ఆ రోజున అలా కాఫీనీళ్ళ వంకతో సంపాయించిన సొమ్ము యెంతవుందో? ★